## క్లుప్తంగా

### నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని 15, 16 డివిజన్లలో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు జరుగనున్నాయని మేయర్ కొలన్ నీలారెడ్డి ఓ ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 7.30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో ప్రభుత్వవిప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, ఎమ్మెల్యే వివేకానంద్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

### జీడిమెట్ల పోలీసు అధికారుల వివరాలు

జీడిమెట్ల: జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలు పోలీసులను సంప్రదించాలంటే సెక్టారు వారీగా అధికారుల ఫోన్ నంబర్లు.

| | |
|---|---|
| ఎం.పవన్ (ఎస్‌హెచ్‌ఓ) | 94906 17220 |
| అంజనేయులు (క్రైం ఎస్సై) | 87126 63211 |
| సతీష్‌రెడ్డి (సెక్టార్–1 ఎస్సై) | 87126 63211 |
| కాంతయ్య (సెక్టార్–2 ఎస్సై) | 87126 63212 |
| హరీష్ (సెక్టార్–3 ఎస్సై) | 87126 63213 |
| మన్మధరావు(సెక్టార్–4ఎస్సై) | 87126 63214. |

### 28వ కాన్వొకేషన్ డే

నిజాంపేట్: బాచుపల్లికి చెందిన విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో శనివారం 28వ కాన్వొకేషన్ డే నిర్వహిస్తున్నట్లు కళాశాల యాజమాన్యం ఓ ప్రకటనలో తెలియజేసింది. ఉదయం 10.45 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి గామీట్రానిక్స్ సీఈవో రాజత్ ఓజా ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభోపన్యాసం చేస్తారన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల వైస్ ప్రెసిడెంట్ కోడే దుర్గాప్రసాద్, గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్ హరిశ్చంద్రప్రసాద్, ప్రధాన కార్యదర్శి శేషగిరిరావులు హాజరు కానున్నారని తెలిపారు.

### రేపటి నుంచి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

దుండిగల్: దుండిగల్‌లోని శ్రీవిశ్వేశ్వర, శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయ యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఈనెల 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 9గంటలకు గణపతిహోమం, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, అఖండ దీపస్థాపన, కలశ స్థాపన, అగ్ని ప్రతిష్ఠ, 29న రుద్రహోమం, చండీహోమం, సాయంత్రం 4 గంటలకు కైలాస యంత్రప్రతిష్ఠ, మహాదీపార్చన, 30వ తేదీన సామూహిక కుంకుమార్చనలు, రుద్రహోమం, చండీహోమం, జూన్ 1వ తేదీన యంత్ర ప్రతిష్ఠ, బింబ స్థాపనలు, ప్రాణప్రతిష్ఠ, పూర్ణాహుతి, పార్వతీ పరమేశ్వరుల కల్యాణోత్సవాలు ఉంటాయన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ ఓ ప్రకటనలో కోరింది.

### కరోనా లక్షణాలుంటే పరీక్షలు చేయించుకోండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 18 మంది అనుమానితులకు కోవిడ్ పరీక్షలు చేశారు. అందరికీ నెగిటివ్ రిపోర్టులు వచ్చాయి. కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తీవ్రమైన జ్వరం, ఒంటినొప్పులు, దగ్గు, గొంతునొప్పి వంటి లక్షణాలు ఉంటే కరోనా పరీక్షలు చేయించుకోవాలని వైద్యాధికారులు సూచిస్తున్నారు.

### రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ఘటనలో ఓ మహిళ మృతి చెందిన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దేవరయాంజాల్ సేవాలాల్ మల్లన్న తాండాకు చెందిన రత్నమ్మ(47) గురువారం రాత్రి 10.30 గంటలకు కొంపల్లి మరాటీ బస్తీ మీదుగా ఇంటికి నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో కొంపల్లి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎదురుగా ఉన్న బొల్లారం రోడ్డులో వేగంగా వచ్చిన ఓ గుర్తు తెలియని వాహనం రత్నమ్మను ఢీకొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుమారుడు భీమానాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### గుర్తు తెలియని వ్యక్తి మృతి



జీడిమెట్ల: గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో గాయాల పాలై గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఈనెల 19వ తేదీన ఓ గుర్తు తెలియని వ్యక్తి(55)ను డీసీఎం వాహనం ఢీకొట్టగా సదరు వ్యక్తికి గాయాలయ్యాయి. స్థానికులు ద్వారా విషయం తెలుసుకున్న జీడిమెట్ల పోలీసులు సదరు వ్యక్తిని చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతున్న వ్యక్తి చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. ఈ మేరకు జీడిమెట్ల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పైఫోటోలోని వ్యక్తి ఎవరైనా గుర్తిస్తే ఫొటో నం .94949 59106లో సంప్రదించాలని తెలిపారు.

# వృద్ధ తల్లిదండ్రులను విస్మరిస్తే.. కటకటాలే..!



కుమారులు ఇబ్బందులు పెడుతున్నారని జవహర్‌నగర్ పీఎస్‌ను ఆశ్రయించిన వృద్ధుడు

- వయోవృద్ధుల సంరక్షణకు ప్రత్యేక చట్టం
- వారసుల వికృత చేష్టలకు అడ్డుకట్ట
- డివిజన్ స్థాయిలో ట్రిబ్యునల్ ఏర్పాటు
- రోడ్డుపై వదిలేసినా క్రిమినల్ కేసులు



జవహర్‌నగర్: తల్లిదండ్రుల తర్వాతే దైవం కూడా.. ప్రత్యక్ష దైవాలైన వీరు మలిసంధ్యలో పడరాని పాట్లు పడుతున్నారు. పిల్లలను పెంచి పెద్ద చేసి వారి బంగారు భవిష్యత్ కోసం శ్రమిస్తే వృద్ధాప్యంలో వారిని పట్టించుకోవడం లేదు. రెక్కలొచ్చిన కొడుకులను కన్నవారు బరువైపోతున్నారు. రక్త సంబంధాన్ని తెంచేసుకుని ముసలి తల్లిదండ్రులను రోడ్డుపై వదిలేసి వెళ్లిపోతున్నారు. ఇటువంటి ఘటనలు రోజుకొకటి వెలుగు చూస్తున్నాయి. అయితే ఇలాంటి వాటికి చెక్ పెడుతూ ప్రభుత్వం డివిజన్ స్థాయిలో ఓ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసింది. వృద్ధులైన తల్లిదండ్రులను వీధిపాలు చేస్తే కొడుకులు కటకటాలు లెక్కపెట్టాల్సిందే.

#### వృద్ధులను వదిలేస్తే క్రిమినల్ కేసులు

వృద్ధుల సంపూర్ణ బాధ్యత ఉన్న వ్యక్తులెవరైనా అందుకు విరుద్ధంగా శాశ్వతంగా వదిలించుకునే ఉద్దేశ్యంతో ఏదైనా ప్రదేశంలో విడిచిపెట్టినా, వారికి హాని తల పెట్టినా 3 నెలల జైలు శిక్ష లేదంటే రూ.5 వేల జరిమానా విధిస్తారు. ఒక్కోసారి రెండూ అమలు కావచ్చు. ఇటువంటి కేసులను పోలీస్‌శాఖ చూసుకుంటుంది.

#### సహాయ కేంద్రం ఇదే..

వయోవృద్ధుల సహాయార్థం జిల్లా కేంద్రంలో హెల్ప్‌లైన్ నంబర్: 14567ను ఏర్పాటు చేశారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, కీసర రెవెన్యూ డివిజన్ అదికారి ఫోన్ నెం. 79950 73744 ద్వారా కూడా ఫిర్యాదు చేయవచ్చు.

#### వృద్ధాశ్రమంలో చేర్పించి..

కోట్లు సంపాదించి ఇచ్చిన తల్లిదండ్రులకు తనయులు పట్టెడు అన్నం పెట్టడంలేదు. అయిన వారికి దూరంగా.. భారంగా ఉంటూ జీవనం గడుపుతున్న వారి గాధలు కన్నీళ్లు తెప్పించక మానవు. జీవిత చరమాంకంలో ఆదుకోవాల్సిన తనయులు చేతులు దులుపుకుంటున్నారు. వయోభారంతో వృద్ధులు అవస్థలు పడీ విసిగిపోయి న్యాయం కోసం పోరాడుతున్నారు. పోలీస్‌స్టేషన్లు, కోర్టులను ఆశ్రయిస్తున్నారు. కొందరు కుమారులు తెలివిగా వృద్ధాశ్రమంలో చేర్పించి చేతులు దులుపుకుంటున్నారు.

చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కలెక్టర్ డివిజన్ల వారీగా ట్రిబ్యునల్ ఏర్పాటు చేశారు. అక్కడ డివిజన్ ప్రిసైడింగ్ అధికారిగా ఆర్డీవో వ్యవహరిస్తారు. వృద్ధుల సంఘం నుంచి ఒక ప్రతినిధి, కౌన్సిలేషన్ అధికారి ఉంటారు. సంబంధిత డివిజన్ కార్యాలయంలో వృద్ధులు ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదులు స్వీకరించిన అనంతరం ఆర్డీవో సంబంధిత తహసీల్దార్‌కు విచారణ కోసం ఆదేశిస్తారు. ఇరువర్గాలను పిలిచి వాదనలు విని న్యాయం చేస్తారు. వినని పక్షంలో కౌన్సిలేషన్ అధికారికి అనుసంధానం చేస్తారు. ఆయన ఇరు వర్గాలకు కౌన్సెలింగ్ ఇస్తారు. ఒకవేళ న్యాయం జరగలేదని భావిస్తే జిల్లా అప్పిలేట్ అధికారి కలెక్టర్‌ను ఆశ్రయించవచ్చు. వృద్ధులే కాకుండా ఎన్జీవోలు కూడా ఫిర్యాదు చేయవచ్చు. ఫిర్యాదు చేసేవారు ఎవరైనా నిర్ణీత ఫారంను పూర్తిచేసి డివిజన్ రెవెన్యూ అధికారికి అందించాలి.

**ఎవరికి ఫిర్యాదు చేయాలి?**

వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం-2007

వారసుల వికృత చేష్టలకు అడ్డుకట్ట వేస్తూ వృద్ధుల సంరక్షణ కోసం ప్రభుత్వం ఓ చట్టాన్ని అమలు చేస్తోంది. తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ సంక్షేమ చట్టం –2007ను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలయ్యేలా కలెక్టర్ ఆదేశాల ప్రకారం కన్నవారిని విస్మరిస్తే ఇక జైలు కూడు తినాల్సిందే. మలిసంధ్యలో ఆదరించాల్సిన కుమారులు వారిని పట్టించుకోకపోతే ఈ చట్టం తీవ్రంగా పరిగణిస్తుంది.

#### ఎవరికి వర్తిస్తుంది..?

ఈ చట్టం దేశమంతా వర్తిస్తుంది. ఈ చట్టం ప్రకారం తల్లి, తండ్రి, సవతి తండ్రి/తల్లిని వయోవృద్ధుల కింద పరిగణిస్తారు. ఆస్తి ఉన్నవారు, వారసత్వంగా పొందుతున్న వారు, బంధువులు, చట్టంలో పేర్కొన్న ప్రకారం స్థిర, చర, వారసత్వ,స్వార్జిత ఆస్తులు తదితరాలపై వయోవృద్ధులకు హక్కు ఉంటుంది.

#### ప్రయోజనం ఇలా ..

సొంత సపాదనతో తమను తాము పోషించుకోలేని వృద్ధులు, తల్లదండ్రులు ఈ చట్ట ప్రకారం తమ పిల్లలను వారి పోషణ గురించి అడగవచ్చు. సొంత సంపాదనతో తమను తాము పోషించుకోలేని సంతానం లేని వృద్ధులు వారి ఆస్తిని అనుభవించే బంధువులను పోషణ గురించి అడగవచ్చు. పోషణ ఖర్చులో ఆహారం, దుస్తులు, నివాసం, వైద్య సహాయం, చికిత్సకు అవసరమైన మొత్తం నెలకు రూ.10 వేలకు మించకుండా పోషణ నిమిత్తం అందేలా ట్రిబ్యునల్ చర్యలు తీసుకుంటుంది.

#### పత్రికా కథనాలపై సమగ్ర విచారణ

వివిధ దినపత్రికల్లో వచ్చే వృద్ధుల కథనాలను సుమోటోగా స్వీకరించి కేసు నమోదు చేసేందుకు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయం పత్రికల్లో వచ్చే కథనాలను కత్తిరించి సంబంధిత తహసీల్దార్‌లకు సమాచారం ఇస్తుంది. తహసీల్దార్ వాస్తవ నివేదికను రూపొందించి ఆర్డీవోకు నివేదిస్తారు. ఇరు వర్గాలను పిలిచి రాజీ కుదర్చడమో, కేసు నమోదు చేయడమో నిర్ణయిస్తారు.

#### 235 కేసులను పరిష్కరించాం



మలి వయస్సులో ఉన్న తల్లిదండ్రులకు వారసులుగా తోడుగా ఉండాలి. వారిని నిర్లక్ష్యం చేయకుండా సంరక్షించాలి. అనవసరంగా ఫిర్యాదుల వరకు తెచ్చుకోకూడదు. వృద్ధులు కూడా తప్పుడు ఫిర్యాదులు చేస్తే ఉపేక్షించం. ఇప్పటి వరకు 235 కేసులను పరిష్కరించాం. మరికొన్ని పరిష్కరించాల్సి ఉంది.

– రవి, కీసర ఆర్డీవో

#### నిర్లక్ష్యం వహిస్తే కటకటాలపాలే..



వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల బాగోగులను చూసుకోవాల్సిన బాధ్యత కుమారులది. పిల్లలను పెంచి పెద్ద చేసి వారి బంగారు భవిష్యత్ కోసం శ్రమిస్తే వృద్ధాప్యంలో వారికి తోడుగా నిలవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిది. వారిని నిర్లక్ష్యం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. వారికి హాని తలపెడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం.

– సీతారాం, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, జవహర్‌నగర్

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



శ్రీవైష్ణవి దుర్గా ఆలయ విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, కార్పొరేటర్లు

రంగారెడ్డినగర్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని తెలంగాణ శాసన మండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు శంభీపూర్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్సీని మర్యాదాపూర్వకంగా కలిశారు. తమ ప్రాంతాల్లో మౌలిక వసతులను మెరుగుపరిచి సమస్యలను పరిష్కరించాలని కోరుగా ఆయన సానుకూలంగా స్పందించారు.



ఎమ్మెల్సీకి సమస్యలను వివరిస్తూ..

**అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో..**

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధి మగ్దూమ్‌నగర్‌లోని శ్రీవైష్ణవిదుర్గా, శ్రీచక్ర ఉపదేవతలు సహిత ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవానికి ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందన్నారు. అమ్మవార్ల కృపతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలన్నారు. కార్పొరేటర్లు కొలుకుల జగన్, రావుల శేషగిరి, మంత్రి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేష్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సంక్షేమానికి పాటు పడతాం



గాంధీనగర్ పారిశ్రామికవాడలో సుభాష్‌ను సత్కరిస్తున్న భాస్కర ఎలక్ట్రానిక్స్ పరిశ్రమ కార్మికులు

రంగారెడ్డినగర్: కార్మికుల సంక్షేమమే పరమావధిగా బీఆర్‌ఎస్‌కేవీ పని చేస్తోందని శ్రమశక్తి అవార్డు గ్రహీత, రాష్ట్ర కార్మిక నేత ముద్దాపురం మదన్‌గౌడ్ అన్నారు. గాంధీనగర్ ఇండస్ట్రీయల్ ప్రాంతంలోని భాస్కర్ ఎలక్ట్రానిక్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాష్‌కు శ్రమశక్తి అవార్డు వచ్చిన నేపథ్యంలో శుక్రవారం పరిశ్రమకు చెందిన కార్మికులు మదన్‌గౌడ్ ఆధ్వర్యంలో అయనను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల హక్కుల కోసం బీఆర్‌ఎస్‌కేవీ ఎంత వరకైనా పోరాడుతుందన్నారు. ఏ సమస్య వచ్చినా తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం సుభాష్ మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా కార్మికుల కోసం పని చేసిన తనకు అవార్డు రావడం సంతోషంగా ఉందన్నారు. మున్ముందు ఇదే స్ఫూర్తిగా కార్మికుల సంక్షేమానికి పాటు పడతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు మంజుల, జ్యోతి, పద్మావతి, నీలాదేవి, వసుధ, అనిత, రమాదేవి, జయలక్ష్మి పాల్గొన్నారు.

## ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలు

రంగారెడ్డినగర్: ఆలయాల అభివృద్ధికి తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి అన్నారు. శుక్రవారం దుండిగల్ మున్సిపాలిటీ పరిధి భౌరంపేట్‌కు చెందిన శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ నూతన కమిటీ సభ్యులు భూపతిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను సత్కరించిన ఆయన మాట్లాడారు. ఆలయాలు ఆధ్యాత్మికతకు నిలయాలన్నారు. భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించేందుకు కృషి చేయాలని సూచించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులు బి.నాగరాజు, శంకరప్ప, కోశాధికారి ప్రశాంత్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏం.శేఖర్, కల్చరల్ సెక్రెటరీ నర్సింగ్ రావు, సలహాదారులు రంగం సేట్, రామచంద్రారెడ్డి తదితరులు ఉన్నారు.



భూపతిరెడ్డితో భ్రమరాంబ మల్లికార్జునస్వామి ఆలయ కమిటీ సభ్యులు

## క్రైం కార్నర్..

### అనుమానాస్పదస్థితిలో యువకుడి మృతి

రంగారెడ్డినగర్: అనుమానాస్పదస్థితిలో ఓ యువకుడు చెరువులో పడి మృతి చెందిన ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బహదూర్‌పల్లికి చెందిన ఆకుల సురేష్(26) రోజుమాదిరిగానే ఈనెల 25న మధ్యాహ్న సమయంలో గేదెలను మేపేందుకు ఇంటికి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రైనా ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు అతడికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. అదే రోజు రాత్రి 10గంటల సమయంలో రెండు గేదెలు ఇంటికి చేరుకున్నాయి. దీంతో శుక్రవారం ఉదయం సురేష్ తండ్రి ఆకుల రాములు కుమారుడి కోసం వెతుకుతుండగా స్థానికంగా ఉన్న ఐస్ కంపెనీ వద్ద గేదెలు కనిపించాయి. కొడుకు ఆచూకీ కోసం ముందుకు వెళ్లగా బహదూర్‌పల్లి చెరువులో ఓ మృతదేహం తేలుతూ కనిపించింది. స్థానికుల సహాయంతో మృతదేహాన్ని వెలికితీయగా తన కుమారుడు సురేష్‌గా గుర్తించాడు. కాగా సురేష్ చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడా లేక ప్రమాదవశాత్తు జారి పడి మునిగి మృతి చెందాడా అన్న విషయాలు పోలీసుల దర్యాప్తులో తేలనుంది. అయితే సురేష్ దేహంపై బట్టలు లేవని స్థానికులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలి

కుత్బుల్లాపూర్: మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిస్తూ మెరుగైన పాలన అందించేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా శుక్రవారం ఆయన జీడిమెట్ల డివిజన్ పరిధిలోని వెన్నెలగడ్డ, బౌద్ధనగర్‌లలో పర్యటించారు. స్థానికంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మిగతా పనులను త్వరితగతిన పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్థానికంగా నెలకొన్న సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు సంపత్ మాధవరెడ్డి, కుంట సిద్ధిరాములు, గుమ్మడి మధుసుధన్‌రాజు, జ్ఞానేశ్వర్, వార్డు సభ్యులు సుధాకర్ గౌడ్, ఇందిరారెడ్డి, కాలే నాగేష్, సమ్మయ్య, బాలమల్లేష్, భిక్షపతి, రవి, యాదగిరి, సుబ్బారావు తదితరులు ఉన్నారు.



బౌద్ధనగర్‌లో సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే వివేకానంద్

## దవాఖానా పరిసరాల్లో దుర్గంధం



డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన బస్తీ దవాఖానాలో ఓ వైపు ఇరుకు గదులు ఉంటే.. పరిసరాల్లో చెత్తాచెదారాలతో నిండిపోయింది. దవాఖానాకు ఉన్న గేట్లు విరిగిపోయాయి. అదే విధంగా మరుగుదొడ్డి సౌకర్యం లేకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇన్ని సమస్యలు ఉన్నా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

– చింతల్

## జీఓ.59ను సద్వినియోగం చేసుకోవాలి

**మల్కాజ్‌గిరి ఆర్‌డీఓ మల్లయ్య**

మోతీనగర్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జీఓ.59ను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మల్కాజ్‌గిరి ఆర్‌డీఓ మల్లయ్య పేర్కొన్నారు. శుక్రవారం అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్ కమ్యూనిటీహాలులో జీఓ.59పై ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ సబిహా బేగం విచ్చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డీఓ మల్లయ్య మాట్లాడుతూ.. జీఓ.59 కింద అందిన రుసుమును సకాలంలో చెల్లించి స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ప్రభుత్వం కేటాయించిన రుసుమును సకాలంలో చెల్లించి యాజమాన్య హక్కు పొందాలన్నారు.పదేళ్ల కిందట జీఓ.59 ప్రకారం చెల్లించిన ఇళ్లకు విచారణ చేపట్టి హద్దులను నిర్ణయించి సేల్ డీడ్ టైటిల్ హక్కు కల్పిస్తామని తెలిపారు. కూకట్‌పల్లి మండలం తహసీల్దార్ గోవర్ధన్, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, మైనార్టీ సెల్ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్, నాయకులు సుంకన్న, పార్వతమ్మ, లక్ష్మీరాజు తదితరులు పాల్గొన్నారు.



జీఓ.59పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఆర్‌డీఓ మల్లయ్య, కార్పొరేటర్ సబిహాబేగం

## జీఓ.59 కింద స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలి

**కూకట్‌పల్లి తహసీల్దార్ గోవర్ధన్**

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి మండల పరిధిలోని నివాసితులు ప్రభుత్వం కల్పించిన 58 జీవోతో తమ స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలని శుక్రవారం కూకట్‌పల్లి తహసీల్దార్ గోవర్ధన్ తెలిపారు. జీఓ.58, 59లపై ప్రజల్లో నెలకొన్న సందేహాలను, దరఖాస్తు చేసుకున్న నివాసితులకు ప్రభుత్వం పంపించిన నోటీస్‌లో వచ్చిన అధిక రుసుం చెల్లించేందుకు పడుతున్న ఇబ్బందులపై అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. శుక్రవారం కూకట్‌పల్లి డివిజన్ పాపిరెడ్డినగర్‌లోని శ్రీ వీరాంజనేయ శివాలయం కమిటీ హాలులో బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి సందేహాలను నివృత్తి చేశారు. రెండు లక్షలు ఆపై ఉన్న డబ్బులను చెల్లించి రెగ్యులరైజ్ చేయించుకోవాలన్నారు. రూ.10 – 20 లక్షల ఆపైన చెల్లించాలని నోటీసులు అందుకున్న వారి సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగ్గించే వెసులుబాటును కల్పించేందుకు ప్రయత్నం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి, బస్తీ ప్రధాన కార్యదర్శి భగవంతరెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్, నాయకులు పేర్ని ధర్మారావు, దొడ్ల రాంరెడ్డి, కన్నారావు, ఎం. వెంకటరెడ్డి, ఎం. కనకరెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాసరావు, భిక్షపతి, తిరుపతిరెడ్డి తదిరతులు పాల్గొన్నారు.



పాపిరెడ్డినగర్‌లో జీఓ.58, 59లపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ గోవర్ధన్